క్లుప్తంగా

నేడు కొల్లాపూర్‌లో ఇఫ్తార్

కొల్లాపూర్: పట్టణంలోని మహబూబ్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం సాయంత్రం ముస్లింలకు ప్రభుత్వం తరఫున ఇఫ్తార్ ఏర్పాటు చేయనున్నట్లు జామెమసీద్ కమిటీ నాయకులు అమీన్ పాష, రుక్మద్దీన్ వెల్లడించారు. అధికారికంగా ఏర్పాటు చేసే కార్యక్రమానికి ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి, ప్రభుత్వ అధికారులు హాజరవుతారని చెప్పారు. ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లింలు ఇఫ్తార్‌కు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

దుస్తుల అందజేత



తెలకపల్లి: తెలంగాణ ప్రభుత్వం రంజాన్ కానుకగా ముస్లింలకు దుస్తులను పంపిణీ చేశారు. మండలానికి 225 పేద ముస్లింలకు దుస్తులు మంజూరయ్యాయని మైనార్టీ మండల అధ్యక్షుడు గౌస్‌మోయినుద్దీన్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో పంపిణీ చేశారు. ఖుద్దూస్, రహీం తదితరులు పాల్గొన్నారు.

20న మండల సర్వసభ్య సమావేశం

కొల్లాపూర్: స్థానిక మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 20న నిర్వహించనున్నట్లు ఎంపీపీ బోజ్యానాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సమావేశానికి మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో పాటు, ప్రభుత్వ శాఖల అధికారులు విధిగా హాజరుకావాలని కోరారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు పాలిటెక్నిక్ పరీక్ష రాసేందుకు వైడీఐఆర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ రామకృష్ణ మాట్లాడారు. ఈ సంస్థ ద్వార పేద విద్యార్థులు చదువుకునేందుకు అవసరమయ్యే పుస్తకాలు అందజేస్తామన్నారు. శ్రీను, శేఖర్, రామస్వామి, మల్లేష్, శివ పాల్గొన్నారు.

శ్రీనివాసాచారి ఏకగ్రీవ ఎన్నిక



అచ్చంపేట రూరల్: తెలంగాణ విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా అచ్చంపేటకు చెందిన కాకునూరి శ్రీనివాసాచారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇటీవల జిల్లా కేంద్రంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కాకునూరి శ్రీనివాసాచారి మాట్లాడారు. విశ్వబ్రాహ్మణ మనుమయులు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ప్రగతి సాధించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. తన ఎంపికకు సహకరించిన రాష్ట్ర, జిల్లా కమిటీ బాధ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాలకు సిమెంట్ బెంచీల వితరణ



కల్వకుర్తిరూరల్: పట్టణంలో వాసవీ క్లబ్ రీజినల్ చైర్మన్ ఇరువెంటి రమేష్ పర్యటనను పురస్కరించుకుని స్థానిక శిశుమందిర్ పాఠశాలకు శనివారం రూ.15 వేల విలువ చేసే మూడు బెంచీలను అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడారు. క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షురాలు గాయత్రీ వివాహ వేడుకల సందర్భంగా సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. క్లబ్ అధ్యక్షుడు శ్రీలక్ష్మీశ్రీనివాసులు, లక్ష్మీఆంజనేయులు, ధనలక్ష్మీఅశోక్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ డైరెక్టర్‌కు ఘన సన్మానం

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో నాగర్‌కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ సమావేశం శనివారం నిర్వహించారు. నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కల్మిచర్ల గోపాల్‌ను ఈ సందర్భంగా సన్మానించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ జన్మదినం సందర్భంగా ఘనంగా సన్మానించారు. జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌బాబు, లయన్ కల్మిచర్ల రమేష్, శివ, జగదీశ్వర్, శ్రీధర్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రతిపక్షాల మాటలు నమ్మకండి



చెక్కులు అందజేస్తున్న ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు

లింగాల: ప్రతిపక్షాల మాటలు నమ్మి అటు వైపు మొగ్గితే రాష్ట్రం అభివృద్ధిలో వెనుకబడిపోతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు ప్రభుత్వ విప్ అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సీఎంపై నమ్మకంతో తనను రెండు సార్లు ఎమ్మెల్యేగా ఆశీర్వదించారని, ఆ ఒరవడిని తిరిగి కొనసాగించాలని కోరారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం దేశంలోనే శరవేగంతో అభివృద్ధి చెందుతుందని అన్నారు. రాబోవు కాలంలో ఢిల్లీలో గులాబీ జెండా ఎగురబోతుందని అన్నారు. ఈ సందర్భంగా రంజాన్ పర్వదినాన్ని పుస్కరించుకుని మైనార్టీలకు పండుగ కానుకలు అందజేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ హన్మంత్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ మాకం తిర్పతయ్య, తహసీల్దార్ మునీరొద్దీన్, ఎంపీడీఓ గీతాంజలి, సుధీర్‌గౌడ్, వర్కింగ్ ప్రసిడెంట్ రాణోజీ, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కుప్పగండ్లలో విచారణ



విచారణ చేపడుతున్న డీఎల్‌పీఓ పండరినాథ్

వెల్దండ: మండల పరిధిలోని కుప్పగండ్లలో శనివారం డీఎల్‌పీఓ పండరినాథ్ విచారణ చేపట్టారు. గ్రామంలో ముస్లింలు మసీదు నిర్మాణం చేపట్టి ప్రహరీ నిర్మాణం చేపడుతున్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన మట్ట పరమేష్‌గౌడ్ ప్రహరీ అనుమతులు లేకుండా గ్రామపంచాయతీ స్థలాన్ని కబ్జా చేసి నిర్మాణ పనులు చేస్తున్నట్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయన గ్రామంలో విచారణ చేపట్టారు. ఎలాంటి అనుమతులు లేవన్నారు. ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. గ్రామంలో చేపడుతున్న నిర్మాణ పనులను తాత్కాలికంగా నిలిపివేయాలని వారికి సూచించారు. కార్యదర్శి మంజుల, గ్రామ పెద్దలు, మాజీ సర్పంచ్‌లు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణకు బైక్ యాత్ర

ఉప్పునుంతల: అంబేడ్కర్ రాజ్యాంగంలో పొందుపర్చిన రిజర్వేషన్లు, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు కుల వివక్ష పోరాట సమితి ఆధ్వర్యంలో బైక్ యాత్రతో ప్రజలను చైతన్యం చేస్తున్నామని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నందిపేట భాస్కర్ అన్నారు. శనివారం కేవీపీఎస్ బైక్ యాత్ర మండల కేంద్రానికి చేరుకున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 14న అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని పెంట్లవెల్లి మండలం జటప్రోలులో బైక్ యాత్ర ప్రారంభించి జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాల మీదుగా ఈ నెల 20న నాగర్‌కర్నూల్‌కు చేరుకుంటుందని తెలియజేశారు. దళితుల సమస్యలను గుర్తించి కలెక్టర్‌కు వినతి అందజేస్తామన్నారు. కేవీజీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న, హనుమంతు, జగన్, మహేష్, కుర్మయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

యాపట్లలో చలివేంద్రం ప్రారంభం



పెద్దకొత్తపల్లి: యాపట్లలో ఆటో డ్రైవర్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం ఉప సర్పంచ్ అజయ్, ఆటో యూనియన్ కార్యదర్శి చంద్రశేకర్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రయాణికుల దాహం తీర్చడానికి చలివేంద్రం ఉపయోగించుకోవాలని కోరారు. జహంగీర్, రాముడు, రమేష్, సత్యం, మహేష్, శివ, శ్రీను, వెంకటస్వామి, శివుడు పాల్గొన్నారు.

వైర్లు తగిలి పశుగ్రాసం దగ్ధం



మన్ననూర్: విద్యుత్ వైర్లు తగిలి డీసీఎంలోని పశుగ్రాసం (వరిగడ్డి) దగ్ధమైన సంఘటన శనివారం ఉదయం మన్ననూర్‌లో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. అమ్రాబాద్ మండల కేంద్రానికి చెందిన ఏపీ29 టీబీ 0586 నంబరు డీసీఎం మైదాన ప్రాంతం నుంచి పశుగ్రాసం తీసుకొని ప్రశాంతినగర్‌కు వెళ్తుంది. ఈ క్రమంలో మార్గమధ్యలో రోడ్డు పైభాగంలోని విద్యుత్ వైర్లకు డీసీఎంలోని గడ్డి తగిలి మంటలు వ్యాపించాయి. డ్రైవర్ చుట్టుపక్కల వారు కలిసి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. ఫైర్ ఇంజిన్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు 3 గంటల పాటు శ్రమించి మంటలను అదుపు చేశారు.

హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోండి

తెలకపల్లి: మహబూబ్‌నగర్ ఈస్ట్ రీజియన్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి 6 నుంచి 9 తరగతుల ప్రవేశ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాల్ టికెట్లు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలకపల్లి బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సాయిలత శనివారం తెలియజేశారు.

గురుకులంలో ప్రవేశ పరీక్ష

బిజినేపల్లి: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల్లో ఆరో తరగతి నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లకు ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సుమతి శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇదే పాఠశాలలో ఉదయం 11 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందని, విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి హాజరుకావాలని సూచించారు.

ఏర్పాట్లు పూర్తి..

కోడేరు: మండల కేంద్రంలో మాడల్ స్కూల్ ప్రవేశానికి నిర్వహించే పరీక్షకు ఏర్పాట్లు చేసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఉమయశ్రీ తెలిపారు. ఆరో తరగతికి ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఏడో తరగతి నుంచి 10వ తరగతి వరకు మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు పరీక్ష ఉంటుందని చెప్పారు. విద్యార్థులు గంట ముందు పరీక్ష కేంద్రానికి రావాలని పిలుపునిచ్చారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ : ముగ్గురికి గాయాలు

కోడేరు: మండల కేంద్రం శివారులో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురికి గాయాలైన సంఘటన శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం కేతెపల్లికి చెందిన రాములు, శ్రీను, కోడేరులో మామిడి తోటను కౌలుకు తీసుకున్నారు. సాయంత్రం పనులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై సొంత గ్రామానికి వెళ్తున్నారు. కోడేరుకు చెందిన యువకుడు రమేష్ సొంత పనిపై సింగోటం వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తున్నాడు. కోడేరు శివారులో రాంరెడ్డి పొలం మలుపు వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. రాములు తలకు బలమైన గాయాలు తగలడంతో చుట్టుపక్కల వారు చూసి వెంటనే చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూల్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. శీను, రమేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

తండాల్లో ఎక్సైజ్ దాడులు

ఉప్పునుంతల: మండలంలోని దేవదారికుంట తండా, గుట్టమీది తండా, కాంసానిపల్లి తండాలో శనివారం ఉదయం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఆయా తండాల్లో సారా తయారీలో ఉపయోగించే 350 లీటర్ల బెల్లం ఊటను పారబోయడంతో పాటు 4 లీటర్ల సారా దొరికినట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ బాలవర్ధన్‌రెడ్డి తెలియజేశారు. దేవదారికుంట తండాలో సారాతో పట్టుబడిన కవితపై కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ గణపతిరెడ్డి, జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ పరమేశ్వర్‌గౌడ్, ఎస్‌ఐ రవి, స్టేషన్ ఎస్‌ఐ జనార్దన్ సిబ్బంది పాల్గొన్నారు.

నాటిన మొక్కలను సంరక్షించాలి



రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలకు నీటిని సరఫరా చేస్తున్న ఎంపీడీఓ గంగామోహన్

తాడూరు: తెలంగాణకు హరితాహార కార్యక్రమంలో ఆయా గ్రామాల్లో నాటిన మొక్కలను సంరక్షించడంలో అందరూ భాగస్వాములు కావాలని ఎంపీడీఓ గంగామోహన్ కోరారు. శనివారం మండలంలోని తిరుమలాపురం గ్రామాలను సందర్శించారు. ఆయా గ్రామాల్లో నర్సరీలను పరిశీలించి మొక్కలు ఎండిపోకుండా ప్రతిరోజూ నీరు సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. మొక్కలను సంరక్షించే బాధ్యత సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులపై ఉందనే విషయాన్ని మరిచిపోరాదని గుర్తు చేశారు.

ఆర్థిక సాయం అందజేత



చారకొండ: మండలంలోని జూపల్లిలో శుక్రవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో అంకిల్ల నిరంజన్ మృతిచెందాడు. ఆయన కుటుంబానికి శనివారం వారి నివాసంలో కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం రూ.5 వేలు, వెల్దండ సింగిల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కర్ రావు రూ.10 వేలు అందజేసిన ఆర్థికసాయాన్ని బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రసిడెంట్ జూపల్లి వెంకటయ్య యాదవ్, సిరాజ్ తదితరులు వారి కుటుంబానికి అందజేశారు. సర్పంచ్ మల్లీశ్వరి రూ.5 వేలు అందజేశారు.

దాతల సాయం సద్వినియోగం చేసుకోవాలి



భోజనాన్ని అందజేస్తున్న దాత రవీందర్‌గౌడ్

తాడూరు: ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు దాతలు అందించే సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకోవాలని పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం గ్రామానికి చెందిన దాత రవీందర్‌గౌడ్ పాఠశాల విద్యార్థులకు పోషక విలువలు కలిగిన ఆహారంతో పాటు విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. పాఠశాలలోని విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం అమలుచేసే పథకాలతో పాటు గ్రామానికి చెందిన దాతలు ఎంతగానో తోడ్పాటునిస్తున్నారని అన్నారు. ఉపాధ్యాయులు మోహన్‌సాగర్, రవికుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

తెలకపల్లి: మండల కేంద్రానికి చెందిన బాలయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. బాధిత కుటుంబాన్ని కూచుకుళ్ల రాజేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. రూ.5 వేల ఆర్థిక సాయం అందించినట్లు బంధువులు తెలిపారు. మృతుడికి భార్యతో పాటు నలుగురు పిల్లలు ఉన్నారు.

అచ్చంపేట రూరల్: పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీలో నివాసం ఉంటున్న టీడీపీ కార్యకర్త భారతమ్మ శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మోపతయ్య శనివారం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన సోషల్‌మీడియా నాయకులు



తాడూరు: బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు బొడ్డుపల్లి రాములు ఆధ్వర్యంలో సోషల్‌మీడియా నాయకులు శనివారం స్థానిక ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో సోషల్‌మీడియా ద్వారా పార్టీని ముందుకు తీసుకెళ్తామన్నారు. రాములు జన్మదినం పురస్కరించుకుని ఎమ్మెల్యేను కలిశామని, సోషల్ మీడియా కమిటీల వివరాలు ఎమ్మెల్యేకు వివరించామన్నారు. గౌరీకుమార్, అభిమన్యు, రమేష్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నరేష్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

పాలించే నైతిక హక్కు లేదు



సమావేశంలో మాట్లాడుతున్న బాల్‌నర్సింహ

తెలకపల్లి: దేశాన్ని పాలించే నైతిక హక్కు ప్రధాని నరేంద్రమోదీకి లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాల్‌నర్సింహ అన్నారు. శనివారం మండల కేంద్రంలో మండల కార్యవర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బీజేపీ హఠావో, దేశ్‌కో బచావో పేరుతో దేశవ్యాప్తంగా ప్రజల వద్దకు వెళ్తామన్నారు. బీజేపీ ప్రభుత్వ విధానాలతో దేశంలో వివిధ రంగాల్లో జరుగుతున్న అన్యాయాలను, రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి, లౌకిక సంస్థలకు, ప్రభుత్వ రంగాలను నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు. బీజేపీ ప్రభుత్వం మోదీ అధికారంలోకి వచ్చిన అనంతరం పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్‌తో పాటు అన్ని రకాల నిత్యావసర సరుకుల ధరలు వందశాతం పెరిగిపోయాయన్నారు. ఎరువులు, పురుగు మందుల ధరలను ఎన్నడూ లేని విధంగా పెంచి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజలను సిద్ధం చేసేందుకు ఇంటింటికి సీపీఐని తీసుకెళ్లాలన్నారు. జిల్లాలో ఈ నెల 17 నుంచి సీపీఐ జన చైతన్య యాత్ర ప్రారంభమవుతుందన్నారు. నాయకులు కేశవులు గౌడ్, బాలమురళీ, శంకర్‌గౌడ్, రవీందర్, ఆంజనేయులు, బిచ్చయ్య పాల్గొన్నారు.

17న తెలకపల్లి నుంచి సీపీఐ పాదయాత్ర

నాగర్‌కర్నూల్‌రూరల్: బీజేపీ హటావో, దేశ్‌కో బచావో అనే నినాదంతో సీపీఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇంటింటికీ సీపీఐ పాయాత్రను ఈ నెల 17న తెలకపల్లి మండల కేంద్రం నుంచి ప్రారంభించనున్నామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.బాల్‌నర్సింహ తెలిపారు. శనివారం సీపీఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 2014లో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం మతాల మధ్య చిచ్చుపెట్టడం, ప్రభుత్వ విధానాలను విమర్శిస్తే దేశ వ్యతిరేఖులుగా ప్రచారం చేయడం తప్పా.. అభివృద్ధి చేసింది ఏమీ లేదని ఎద్దేవా చేశారు. ఆనందీజీ, కేశవులుగౌడ్, వార్ల వెంకటయ్య, చంద్రమౌళి, నరసింహ, ఏసయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరిస్తాం..



ఆలయాన్ని సందర్శించిన వరప్రసాద్‌రెడ్డి

కల్వకుర్తి రూరల్: మండలంలోని జిల్లెల్ల గ్రామ అభివృద్ధికి తనవంతు సహకారం అందజేస్తానని ఐక్యతా ఫౌండేషన్ ఎక్జిక్యూటివ్ మెంబర్ సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లెల్లలోని మడేలయ్య, పోచమ్మ, మసీదులను పరిశీలించారు. ఈ సందర్భంగా వరప్రసాద్‌రెడ్డి మాట్లాడారు. ఆలయాలతో పాటు గ్రామంలో అభివృద్ధికి ఐక్యతా ఫౌండేషన్ సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో నిజాముద్దీన్, మల్లయ్య, ప్రవీణ్, మహేందర్, శ్రీహరి, భూపతిరాజు, గణేశ్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ‘బలగం’ చిత్ర ప్రదర్శన



లింగాలలో ఓపెన్ థియేటర్ ద్వారా చిత్రప్రదర్శన

లింగాల: తెలంగాణ గ్రామీణ ప్రాంతాల ప్రజల మనస్సును కరిగించే ‘బలగం’ చిత్ర ప్రదర్శనలు మండలంలో ముమ్మరంగా కొనసాగుతున్నాయి. తెలంగాణ యాస, భాషను కళ్లకు కట్టినట్లు చూపించిన ఈ సినిమాను వీక్షించేందుకు ప్రజలు ముందుకొస్తున్నారు. ఇప్పటికే మండల కేంద్రం లింగాల, మండల పరిధిలోని సూరాపురం, అప్పాయపల్లి, పద్మన్నపల్లి, అంబట్‌పల్లి గ్రామాల్లో దాతల సహకారంతో సినిమాను ప్రదర్శించారు. వివిధ కారణాలతో విడిపోయిన అన్నదమ్ములు ఏ రకంగా ఏకమయ్యారు, చెడు వ్యవసనాలకు బానిసలుగా మారి కుటుంబాలను మర్చిపోవడం లాంటి ఇతివృత్తాన్ని హాస్యంతో ... హాసాలతో రూపొందించిన చిత్రం చూసేందుకు ప్రజలు ఎగబడుతున్నారు. గ్రామాల్లో ఓపెన్ థియేటర్ల ద్వారా చిత్రాన్ని ప్రదర్శిస్తున్నారు.

పౌష్టికాహారంపై అవగాహన



మాట్లాడుతున్న శ్రీనివాసులు

కల్వకుర్తి: గర్భిణిలు, చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందజేస్తున్న విషయాన్ని తెలుసుకోవాలని కౌన్సిలర్ శ్రీనివాసులు కోరారు. శనివారం జన ఆరోగ్య సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని శుభాష్‌నగర్ అంగన్‌వాడీ పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సరైన పద్ధతిలో పౌష్టికాహారం తీసుకోకుంటే ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. డాక్టర్ సుష్మ మాట్లాడారు. గర్భిణిలకు ఎలాంటి ఇబ్బంది ఉన్నా.. తనను సంప్రదించాలని కోరారు. హేమలత, వెంకట్రాములు, వజ్రమణి, రామేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

చలో అచ్చంపేటను జయప్రదం చేయండి



లింగాలలో చలో అచ్చంపేట వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

ఉప్పునుంతల: విద్యార్థిని నిఖిత హత్యను నిరసిస్తూ.. అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించనున్న చలో అచ్చంపేట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని శనివారం మండలంలోని తాడూరులో వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. నిఖిత కుటుంబానికి న్యాయం చేయాలని, హత్యకు కారకులైన దోషులకు శిక్షపడే వరకు పోరాటం సాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్లు విడుదల

లింగాల: మన్ననూర్ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థిని నిఖిత మృతికి నిరసనగా ఆదివారం చలో అచ్చంపేట కార్యక్రమం వాల్ పోస్టర్లను శనివారం మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విడుదల చేశారు. జగదీష్, బుద్దయ్య, నిరంజన్, వెంకటయ్యగౌడ్, ఇందిరమ్మ పాల్గొన్నారు.

కార్యదర్శుల సమ్మె నోటీసు



వెల్దండ: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 28న సమ్మె చేపట్టనున్నట్లు కార్యదర్శులు తెలియజేశారు. సమ్మెకు సంబంధించిన నోటీసులను సూపరింటెండెంట్ మోహన్‌లాల్‌కు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జూనియర్ గ్రామ కార్యదర్శులను క్రమబద్ధీకరణ చేయాలని కోరారు. ప్రభుత్వం రెండేళ్లలో వారిని కార్యదర్శులుగా గుర్తించి గౌరవ వేతనాలు అందిస్తామని హామీ ఇచ్చి అమలు చేయడంలేదన్నారు. కార్యదర్శులు ఫయాజ్, సురేందర్‌రెడ్డి, మంజుల, స్వప్న, మురారి, అల్తాప్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.